క్లుప్తంగా

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన



మధురానగర్(విజయవాడసెంట్రల్): వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం మధురానగర్ మసీదు వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే బాబు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును దేశ ప్రజలంతా అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రాజ్యాంగం ముస్లింలకు కల్పించిన హక్కులను సవరణ బిల్లుతో కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సవరణ బిల్లు తెచ్చి వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకోవాలని కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తొలుత రంజాన్ పర్వదినం పురస్కరించుకుని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులు ఎస్‌కే చాంద్ బాషా పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ముగిసిన ఈశ్వరమ్మతల్లి ఉగాది సంబరాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీ ఈశ్వరమ్మ అమ్మవారి ఉగాది సంబరాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం దాత రుద్రరాజు వెంకట సుబ్బరాజు దంపతులచే భారీ అన్న ప్రసాద వితరణజరిగింది. సుమారు మూడు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి అమ్మవారి ప్రసాదంను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సామంతపూడి చిన్నా పాల్గొని స్వయంగా భోజనాలు వడ్డించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ సుబ్బరాజు, దాట్ల శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా చలివేంద్రాలు పెట్టాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మండే ఎండల్లో బాటసారులకు చల్లటి తాగునీరు, మజ్జిగను అందించేందుకు సామాజిక బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ గంగానమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను సోమవారం బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వేసవిలో మూడు నెలల పాటు నిరంతరాయంగా చలివేంద్రం ఏర్పాటు చేస్తూ ప్రజలకు చల్లటి తాగునీరు అందిస్తున్న లింగారెడ్డి జగ్గారెడ్డిని అభినందించారు. అనంతరం బాటసారులకు మజ్జిగ, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె. దుర్గారావు, పి.కృష్ణమూర్తి, ఎం. నాగార్జున, అవనిగడ్డ పున్నారావు, ఎస్.కె సలీంముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ 11 కేవీ జీవీఆర్ నగర్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఆర్ నగర్ కాలనీ ఒకటో రోడ్డు నుంచి మూడో రోడ్డు వరకు, దావు బుచ్చయ్య కాలనీ ఒకటో రోడ్డు నుంచి మూడో రోడ్డు వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీకి చెందిన బాలిక బట్టలషాపులో పనికి వెళుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తొమ్మిదో తరగతి చదివిన బాలిక విజయవాడ రామాటాకీస్ వద్ద బట్టల షాపులో పనిచేస్తుంది. గత నెల 30వ తేదీన బట్టల షాపునకు వెళుతున్నానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. ఇంటి వద్దనే వుంటున్న కిషోర్ అనే వ్యక్తితో మాట్లాడుతుండేదని ఆయనపై అనుమానంగా ఉందని బాలిక నాయనమ్మ పితాని ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదాలకు కేరాఫ్ బీఆర్టీఎస్ రోడ్డు

- నిత్య కృత్యంగా మారుతున్న ప్రమాదాలు
- పదుల సంఖ్యలో మరణాలు
- వందలాది మంది క్షతగాత్రులు



బీఆర్టీఎస్ రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరానికే తలమానికంగా సువిశాలమైన బీఆర్టీఎస్ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రయ్ రయ్ మంటూ పెద్ద సంఖ్యలో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ అతి వేగం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు ప్రారంభించిన నాటి నుంచి ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు, వందల సంఖ్యలో క్షతగ్రాత్రులుగా మిగిలారు. బీఆర్టీఎస్ రోడుడ్ సీతన్నపేట గేటు వద్ద మొదలై గుణదల పడవల రేవు సెంటర్ వద్ద ముగిస్తుంది. ఈ రోడ్డు మొత్తం సుమారు మూడు కిలోమీటర్లు ఉంటుంది.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు

జూన్ 11వ తేదీ తెల్లవారుజామున మూడు గంటలకు ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి 140 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, మరొకరు ఆసుపత్రి పాలయ్యారు. అలాగే ఆగస్టు 26వ తేదీన కేంద్రీయ విద్యాలయం వద్ద 100 కిలోమీటర్ల వేగంతో దూసుకు వచ్చిన కారు కేంద్రీయ విద్యాలయం లోనికి వెళ్తున్న ముగ్గురు విద్యార్థులు, మహిళను ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళతోపాటు విద్యార్థులు గాయాలతో బయటపడ్డారు. అలాగే ఇటీవల పడవలరేవు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. భానునగర్ జంక్షన్ వద్ద ఒక యువకుడు మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనంను ఢీ కొట్టడంతో ఒక యువకుడు చనిపోయాడు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇటువంటి ఘటనలు ఇక్కడ కోకొల్లలుగా జరిగాయి.

ప్రమాదకరంగా కూడళ్లు....

విశాలంగా ఉండే బీఆర్టీఎస్‌రోడ్డులోని మధురానగర్ నార్లవారివీధి కూడలి, భానునగర్ జంక్షన్‌మలుపులు తిరిగే క్రమంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. వేగంగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ఒక్కసారిగా పక్క మలుపు నుంచి వచ్చిన వాహన చోదకులను ఢీ కొడుతున్నారు.



నార్లవారి వీధి మలుపు వద్ద ఆక్రమణలు

అనధికారికంగా రాకపోకలు....

గులాబీతోట ప్రాంతం నుంచి బీఆర్టీఎస్‌రోడ్డులోకి ఎవరికి వారు రోడ్డు మార్గం నిర్మించుకున్నారు. దీంతో వేగంగా వస్తున్న వాహనాలకు పక్క నుంచి వస్తున్న వాహనాలు కనిపించటం లేదు. దీంతో ఒక్కసారిగా రావటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బీఆర్టీఎస్‌రోడ్డు నిర్మాణసమయంలో జంక్షన్‌లలో తప్ప తక్కిన ప్రాంతాలనుంచి బీఆర్టీఎస్‌రోడ్డులోకి రాకుండా డివైడర్‌లు ఏర్పాటు చేశారు. కానీ ఇటీవల అధికారుల నిర్లక్ష్యంతో పక్క ప్రాంతాల వారు బీఆర్టీఎస్ రోడ్డుకు ర్యాంపులు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ఆక్రమణలు....

బీఆర్టీఎస్ రోడ్డు నార్లవారి వీధి మలుపు ప్రాంతంలో హాకర్‌లు ఇష్టారాజ్యంగా రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో రాకపోలకు సాగించే క్రమంలో పక్క నుంచి వచ్చేవారు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే అవసరమైన ప్రాంతాలలో బారికేడ్లు సైతం ఏర్పాటు చేయకపోవటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే బీఆర్టీఎస్‌రోడ్డులోని మధ్య రోడ్డు నిరుపయోగంగా మారటంతో పాటు

ఇలా చేస్తే సరి...

ఇక్కడ ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది.

- పడవల రేవు సెంటర్ నుంచి మధురానగర్ వంతెన వరకు ఉదయం సాయంత్రం రద్దీ సమయాలలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి
- బీఆర్టీఎస్ రోడ్డులో వేగ నియంత్రణకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలి
- మధురానగర్ వంతెన, భాను నగర్ కేంద్రీయ విద్యాలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలి.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



సాంస్కృతిక సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న విజయలక్ష్మి, ప్రసూనా రామన్

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి తెలిపారు. సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం సాంస్కృతిక, కళారంగాలకు చెందిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని చెప్పారు. ఉగాది పురస్కారాల్లో సాంస్కృతిక, కళారంగాలు, గాయనీ గాయకుల విభాగాన్ని చేర్చి వారికి కూడా ఉగాది పురస్కారాలు ఇవ్వాలని సూచించారు. జ్యోతిష్యశాస్త్ర వేత్త ప్రసూనా రామన్ కళాపీఠం చేస్తున్న కృషిని అభినందించారు. చింతకాయల చిట్టిబాబు, గుడిపాటి హరికృష్ణ, శ్యాంప్రసాద్, బీవీ వీరభద్రరావు డేవిడ్‌రాజు, సత్యవర్ధన్, ఆదిరాల జయప్రభ, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, తబలా చిట్టిబాబు, కొప్పుల అశోక్, చావా నరసింహారావు, కారుమంచి రాజు, అమాలారాణిలను సత్కరించారు.

మద్దతు ధర కల్పిస్తూ చట్టం చేయాలి

ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)ను చట్టబద్ధం చేయాలని ఏఐకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి గనిరాజు డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు–కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మూడో జాతీయ మహాసభ పిలుపుమేరకు 'భారత వ్యవసాయ మార్కెట్లను బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, అమెరికన్ సామ్రాజ్యవాదానికి మోదీ ప్రభుత్వ లొంగుబాటు విధానాలను నిరసిస్తూ' ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గాంధీనగర్ సీతన్నపేట గేట్ సిగ్నల్ వద్ద ధర్నా జరిగింది. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి, మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గనిరాజు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అటు అంతర్జాతీయ వాణిజ్యరంగంలో, ఇటు అంతర్జాతీయ రాజకీయ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాడని విమర్శించారు. భారత వ్యవసాయ మార్కెట్లను అమెరికా వంటి సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. సీపీఐ(ఎం–ఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను, ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నేత ఎస్. పోతురాజు, అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.శ్రీను, ఐ.ఎఫ్.టి.యు నేతలు జి.శంకర్, నాని, టి.శ్రీను, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం, ధార్మిక చింతన కలయిక రంజాన్

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రంజాన్ పర్వదినం పురస్కరించుకుని పలువురు మత పెద్దలు ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో సోమవారం మల్లాది విష్ణును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మైనారిటీ సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని... సర్వమతాల సారాంశం ఒక్కటేనని.. ఉపవాస దీక్షలు, ఆరాధన ప్రార్థనలు, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ముఖ్య ఉద్దేశమన్నారు.

మైనారిటీతో వైఎస్సార్ సీపీకి బలమైన అనుబంధం...

మైనారిటీలతో వైఎస్సార్ సీపీకి బలమైన అనుబంధం ఉన్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. దేశంలోనే మైనార్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ.. గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పుకొచ్చారు. మైనార్టీల అభ్యున్నతికై ఆనాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన 4 శాతం రిజర్వేషన్ తో ఈ రోజున రాష్ట్రంలో ముస్లింలందరూ విద్య, వైద్య రంగాల్లో రాణించి డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని చెప్పారు. 2019 లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మైనార్టీ యువతకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించినట్లు వివరించారు. 2014–19 మధ్య తెలుగుదేశం ఐదేళ్ల పాలనలో మైనార్టీ సంక్షేమం కోసం ఖర్చుచేసింది కేవలం రూ. 2,665 కోట్లు మాత్రమేనని.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా అక్షరాలా రూ. 23,176 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ఆనాడు మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వడానికి కూడా చంద్రబాబుకు మనసు రాలేదని.. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏకంగా డెప్యూటీ సీఎం హోదా ఇచ్చి గౌరవించుకోవడం జరిగిందన్నారు. ముస్లిం మైనార్టీలకు సంబంధించిన సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించారని పేర్కొన్నారు.

ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు

పాయకాపురం(విజయవాడరూరల్): సుందరయ్య నగర్, రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లో ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. 30 రోజులపాటు కఠినమైన ఉపవాసాలు చేసుకొని నెలవంక కనిపించిన రోజున ముస్లింలు మసీదుల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సుందరయ్యనగర్లోని మసీదు, కండ్రికలో ఏ.హబీబుర్రహ్మాన్ మసీదులో పండుగ నమాజ్ అనంతరం మౌలానా షేక్ సాజిద్ అలీ, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఐకమత్యమే ప్రతిగా అందరం ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో 64వ డివిజన్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. 63వ డివిజన్ కొత్త రాజీవ్ నగర్ మసీదు నందు జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముస్లింలతో కలిసి పాల్గొన్నారు.

ముస్లింలకు సీపీఎం రంజాన్ పండుగ శుభాకాంక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రంజాన్ పండుగ సందర్భంగా సీపీఎం నాయకులు సీహెచ్ బాబూరావు అజిత్ సింగ్‌నగర్ మదీనా మసీదు, షాదీ ఖానా వద్ద ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు మజ్జిగ పంపిణీ చేశారు.



ముస్లింలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సీహెచ్ బాబూరావు

బాబూరావు మాట్లాడుతూ నెల రోజులపాటు కఠోర దీక్షలతో ఎంతో ప్రవిత్రంగా జరిగే పండుగ రంజాన్ అని కొనియాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బి.జె.పి ప్రభుత్వం కుల, మత ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి తన పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. భారతదేశంలో ప్రజలు బి.జె.పి ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు ఐక్యమత్యంతో నడుస్తారన్నారు. బి.జె.పి, తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణను రద్దు చేయాలని, మతసామరస్యాన్ని కాపాడాలని, హిందూ, ముస్లిం, క్రైస్తవ బాయ్ బాయ్ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానాలో రంజాన్ ప్రార్థనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్ షాదీఖానాలో రంజాన్ ప్రార్థనలు సోమవారం జరిగాయి. పెద్ద సంఖ్యలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మతపెద్దలు రంజాన్ గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అల్లా ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



సుందరయ్య నగర్ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అబ్దుల్ రాకిబ్ సేవలు నిరుపమానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పోలీసు శాఖలో వివిధ హోదాల్లో అబ్దుల్ రాకిబ్ అందించిన సేవలు నిరుపమానం అని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ కొనియాడారు. గుణదల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ అబ్దుల్ రాకిబ్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరి అన్నారు. అబ్దుల్ రాకిబ్‌ను స్ఫూర్తిగా తీసుకుని అత్యుత్తమ పనితీరు కనబర్చాలని సూచించారు. ఆయన శేష జీవితం ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ రైటర్ సంతోష్, సిబ్బంది తదితరులు పాల్గొని ఎస్ఐ రాకిబ్‌ను పూలమాలు, శాలువాలతో సత్కరించారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ



పాయకాపురం(విజయవాడసెంట్రల్): అజిత్ సింగ్‌నగర్ బీసీటీసీ కార్యాలయంలో మంగలపూడి మేరీ విశ్రాంతం 14వ జ్ఞాపకర్థ కుడిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బీసీటీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ మంగలపూడి జోసెఫ్ పాల్గొని పలువురు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఎదుటివారికి సహాయపడాలని ఆయన సూచించారు.



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు

ఘనంగా రంజాన్

రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చారిత్రాత్మక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేలాది మంది ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్నారులు సైతం పాల్గొన్ని ఎంతో భక్తితో ప్రార్థనలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వన్‌టౌన్ చిట్టినగర్ మోతీ మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



చిన్నారులను ఒడిలో కూర్చోబెట్టుకొని ప్రార్థన చేస్తున్న దృశ్యం



చిట్టినగర్ మోతీ మసీదులో నమాజ్ చేస్తున్న చిన్నారులు

తులసీ, మారేడు, మరువంతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): వసంత నవరాత్రుల్లో భాగంగా దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన అమ్మవారికి తులసీ, మారేడు, మరువముతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో నీలకంఠేశ్వరస్వామి వారికి విశేషంగా అభిషేకం, సుహాసినీలచే సామూహిక కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం ఖడ్గమాలార్చన, హారతులు జరిగాయి. మంగళవారం తమలపాకులతో అర్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.